సాక్షి
విశాఖపట్నం
గురువారం । 6 । జూలై । 2023



న్యూస్‌రీల్

ట్రాఫిక్ పరికరాల అందజేత



ట్రాఫిక్ పరికరాలను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి: ట్రాఫిక్ నియంత్రణ, అవగాహన కోసం సిద్ధం చేసిన సామగ్రిని విశాఖ డెయిరీ, ఆలీవ్ సతీష్, నార్త్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధులు నగర పోలీస్ శాఖకు అందించారు. రూ.13,13,690 విలువ చేసే సైన్‌బోర్డులు, 10 ట్రాఫిక్ బారికేడ్లు, 180 రేడియం జాకెట్స్, ఒక థెర్మో ప్లాస్టిక్ రీహీటెడ్ పెయింటింగ్ మెషీన్, ఒక లాంగ్ ఫోల్డింగ్ బారికేడ్లను పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ట్రాఫిక్ సరళీకృతం చేయడానికి ఈ పరికరాలు ఉపయోగపడతాయని చెప్పారు. వీటిని అందించిన విశాఖ డెయిరీ, ఆలీవ్ సతీష్, నార్త్ ఇండియన్ అసోసియేషన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వీటిని ఎన్ఎస్‌టీఎల్ నుంచి తాటిచెట్లపాలెం వరకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చొక్కాకుల



సూర్యనారాయణ

విశాఖ విద్య: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విశాఖపట్నంకు చొక్కాకుల సూర్యనారాయణ ఎన్నికయ్యారు. బుధవారం ప్రకటించిన రాష్ట్ర కమిటీలో చొక్కాకుల సూర్యనారాయణకు స్థానం దక్కింది. ఆయన ప్రస్తుతం వైఎస్సార్ టీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు విజయసాయి రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైఎస్సార్ టీఎఫ్ జిల్లా బాధ్యులతో పాటు, పలువురు ఉపాధ్యాయులు చొక్కాకుల సూర్యనారాయణకు అభినందనలు తెలిపారు.

ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌లో ఉజ్వల్‌కి 5వ స్థానం



ఉజ్వల్ చౌదరి

సాక్షి, విశాఖపట్నం : కజికిస్తాన్‌లో జరిగిన ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌లో నేవీ అనుబంధ సంస్థ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జూలై 2న జరిగిన పోటీల్లో ట్రయథ్లాన్‌ని 11 గంటల 4 నిమిషాల్లో ముగించిన డాక్‌యార్డు లెఫ్టినెంట్ కమాండర్ ఉజ్వల్ చౌదరి ఐదో స్థానంలో నిలిచారు. ఈ రేసులో 3.8 కిమీ స్విమ్మింగ్, 180 కిమీ సైక్లింగ్, 42.2 కి.మీ మారథాన్‌ని 11 గంటల్లో పూర్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోటీల్లో 400 మంది పాల్గొనగా.. భారత్‌కు చెందిన 50 మంది పాల్గొన్నారు. ఇండియా తరఫున నంబర్‌వన్‌గానూ, వరల్డ్ టాప్-5లో చోటు సాధించి.. త్వరలో ఫ్రాన్స్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఉజ్వల్ చౌదరి అర్హత సాధించారు.

జాయింట్ ఆప్షన్ ఫారాల సమర్పణ గడువు ఈనెల 11

మురళీనగర్: హయ్యర్ వేజ్ పింఛన్ కోసం సభ్యులు, పెన్షనర్లు జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో ఈ నెల 11వ తేదీలోగా పంపించాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 చంద్ర పవన్ కుమార్ జాస్తి సూచించారు. ఆ తర్వాత వచ్చిన వాటిని పరిగణలోకి తీసుకోమని స్పష్టం చేశారు. ఈపీఎఫ్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వుల మేరకు.. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ 1995కు సంబంధించిన పింఛన్‌దారులు, సభ్యులు అధిక పింఛన్ కోసం యాజమాన్యంతో కలిపి జాయింట్ ఆప్షన్ ఫారాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఇప్పటికే హయ్యర్ వేజ్ పెన్షన్ పొందుతున్న వారు కూడా జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్ పంపించాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల వీరి హయ్యర్ వేజ్ పెన్షన్ అర్హతను సమీక్షించి కొనసాగించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫారాలు పంపించేందుకు https://unifiedportal-mem.epfindia.gov.inను సందర్శించాలని సూచించారు.

దారి మళ్లిన విమానం

గోపాలపట్నం: ఢిల్లీ నుంచి బుధవారం సాయంత్రం 5.40 గంటలకు విశాఖ రావాల్సిన ఎయిరిండియా విమానం సాంకేతిక కారణాల వల్ల పాట్నాలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దీంతో విశాఖకు రావాల్సిన ప్రయాణికులు, విశాఖ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విశాఖ విమానాశ్రయంలో సుమారు 30 మంది విమానం కోసం వేచి ఉన్నారు. వీరి కోసం ఎయిరిండియా సంస్థ తగిన ఏర్పాట్లు చేసిందని విమానాశ్రయం వర్గాలు తెలిపాయి.

సిటీకి కీర్తి కిరీటం

ఆశీలమెట్టలో సిటీ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్

- 2.7 ఎకరాల్లో రూ.265 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు
- షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్, హోటల్ టవర్‌కు అనుకూలం
- ఈవోఐ దరఖాస్తులను ఆహ్వానించిన స్మార్ట్ సిటీ కార్పొరేషన్
- ఈ నెల 12 వరకు సమర్పించే అవకాశం
- కాంపిటీటివ్ బిడ్డింగ్ పద్ధతిలో డెవలపర్ ఎంపిక



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

విశాఖ నగరానికి ఐకానిక్‌గా నిలిచే భవన నిర్మాణానికి గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ (జీవీఎస్‌సీసీఎల్) ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే నగరంలో వివిధ ప్రాంతాల్లో సరికొత్తగా రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు సాంకేతిక సహాయంతో ప్రజలకు సేవలందిస్తున్న స్మార్ట్ సిటీ కార్పొరేషన్.. మరో అడుగు ముందుకేసింది. ఇందుకోసం సంపత్ వినాయక రోడ్డు మార్గంలో ఆశీలమెట్ట ప్రాంతంలో జీవీఎంసీకి చెందిన 2.7 ఎకరాలను నగర అభివృద్ధికి చిహ్నంగా(ఐకానిక్) మార్చేందుకు ప్రతిపాదనలు ఆహ్వానించింది. ఈ ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే విషయంపై ఈ నెల 12లోగా ప్రతిపాదనలు సమర్పించాలని ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తుల(ఈవోఐ)ను కోరింది. మొత్తం 2.7 ఎకరాల్లో ఏకంగా 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉంది. ప్రధానంగా ఈ ప్రాంతంలో షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్, హోటల్ టవర్‌తో పాటు రిక్రియేషన్ సెంటర్ అభివృద్ధి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. మొత్తం రూ.265 కోట్లతో ఏ విధంగా అభివృద్ధి చేస్తారనే విషయాన్ని పేర్కొంటూ సంస్థలు ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో..

ఆశీలమెట్ట.. నగరంలో వాణిజ్య ప్రాంతం. ఇక్కడ జీవీఎంసీకి చెందిన 2.7 ఎకరాల స్థలం ఉంది. ఈ ప్రాంతంలో 6.56 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా ఉంది. 2.16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ప్రాంతంలో వాణిజ్య సముదాయంతో పాటు మాల్, మల్టీప్లెక్స్, హోటల్ టవర్, అర్బన్ రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలమని అధికారులు భావిస్తున్నారు. అయితే.. ఈ ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తామనే ప్రతిపాదనలతో సంస్థలు ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులను సమర్పించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన తర్వాత వచ్చే ఆదాయంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం 33 ఏళ్ల పాటు లీజు పద్ధతిలో ఈ భూమిని కేటాయించేందుకు స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిర్ణయించింది. దీనిని సబ్‌లీజుకు ఇవ్వడం కానీ, స్థలాన్ని పూర్తిగా కొనుగోలు చేయడం కానీ కుదరదని స్పష్టం చేసింది. పూర్తిగా పారదర్శకంగా కాంపిటీటివ్ బిడ్డింగ్ పద్ధతిలో ప్రాజెక్ట్ డెవలపర్‌ను ఎంపిక చేస్తారు. వాటా ఇచ్చే శాతంతో పాటు ఇతర అంశాలను పరిగణలోనికి తీసుకుని సంస్థ ఎంపిక ఉండనుంది.

డీఎఫ్‌బీవోటీ పద్ధతిలో..!

వాణిజ్యానికి అనువుగా ఉండే ఈ ప్రాంతంలో మొత్తం 2.7 ఎకరాల్లో వాణిజ్య భవనాలను నిర్మించాల్సి ఉంటుందని స్మార్ట్ సిటీ కార్పొరేషన్ స్పష్టం చేస్తోంది. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత 33 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే ఈ భూమిలో వాణిజ్య భవనాల ద్వారా వచ్చే ఆదాయంలో జీవీఎంసీకి వాటా ఇవ్వాల్సి ఉంటుంది. వాటా ఇచ్చే శాతంతో పాటు ఇతర అంశాలను పరిగణలోనికి తీసుకుని సంస్థ ఎంపిక ఉండనుంది. అంతేకాకుండా స్థలాన్ని కేవలం లీజు పద్ధతిలో 33 ఏళ్ల పాటు అప్పగించనున్నారు. డిజైన్, ఫైనాన్స్, బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీఎఫ్‌బీవోటీ) పద్ధతిలో చివరకు 33 ఏళ్ల తర్వాత తిరిగి స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు అప్పగించాల్సి ఉంటుంది. దీని అభివృద్ధికి సుమారు రూ.265 కోట్ల మేర వ్యయం అవసరమవుతుందని అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగా తమ ప్రతిపాదనలతో ఆయా సంస్థలు ఎవరైనా ముందుకు వచ్చేందుకు ఈ నెల 12వ తేదీ నాటికి ఈవోఐలను సమర్పించాల్సి ఉంటుంది. వీటిని పరిశీలించిన అనంతరం.. ఒక మంచి ప్రతిపాదనను ఓకే చేసి సంస్థ ఎంపిక ప్రక్రియ తర్వాత నిర్మాణాలు చేపట్టనున్నారు. రెండేళ్లలోనే ఐకానిక్ భవనం అందుబాటులోకి తీసుకురావాలన్నదే అధికారుల లక్ష్యంగా కనిపిస్తోంది.

జల పుష్ప విలాసం!

- ఆశాజనకంగా చేపలవేట
- రెండు నెలల నిషేధం తర్వాత పుష్కలంగా లభ్యత
- గత ఏడాదికంటే బాగుందంటున్న బోటు యజమానులు
- బోట్ల నిండా చేపలతో తిరిగొస్తున్న మత్స్యకారులు



గులివిందలు



రొయ్యలు

సాక్షి, విశాఖపట్నం: రెండు నెలల విరామం తర్వాత వేటకు వెళ్లిన బోట్లకు చేపలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఇవి మత్స్యకారుల మోముల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. గత ఏడాదికంటే ఈసారి సీజను ప్రారంభం ఆశాజనకంగా ఉండడం వీరికి ఊరటనిస్తోంది. చేపల వేట నిషేధం అనంతరం జూన్ 15 నుంచి బోట్లు తొలి దఫా వేటకు వెళ్లి వచ్చాయి. సాధారణంగా మరబోట్లు 10-12 రోజులు, మరికొన్ని బోట్లు వారం రోజులు వేట సాగిస్తాయి. ప్రస్తుతం వీటిలో కొన్ని బోట్లు రెండో విడత వేట కూడా పూర్తి చేశాయి. వారం లోపు వేట సాగించిన బోట్లకు 2-3 టన్నుల చేపలు లభ్యమవుతున్నాయి. వీరి వలలకు మార్కెట్లో మంచి ధర పలికే చేపలు కూడా చిక్కుతున్నాయి. వీటిలో కండవాలు, కానాగడసలు, పారలు, మెత్తని పారలు, గులివిందలు, కళ్ల ఒడుగులు, బడేమట్టలు, సైమన్‌లు వంటివి ఉన్నాయి. కండవాలు, చందువాలు వంటివి కిలోల లెక్కన, మిగిలిన చేపలు బాస్కెట్ (7 కిలోలు) చొప్పున కొనుగోలు చేస్తుంటారు. ఇలా కండవాలు కిలో రూ.200-275 ధర పలుకుతోంది. కానాగడసలు బాస్కెట్ రూ.700-800, మెత్తని పారలు రూ.500-600 (పెద్దవి రూ.800-900), సైమన్లు రూ.500-600 (పెద్దవి రూ.1000-1200), పారలు రూ.800-1000 వరకు ధర పలుకుతోంది. ఇవి గిట్టుబాటు ధరలే అయినప్పటికీ ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి కూడా ఈ హార్బర్‌కు వ్యాన్లలో చేపలు తెచ్చి విక్రయిస్తుండడం వల్ల వ్యాపారులు/దళారులు రింగ్ అయి తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తున్నారని దూడ పోలయ్య అనే బోటు యజమాని 'సాక్షి'తో చెప్పారు.

పశ్చిమ తీరానికి ఎగుమతి..

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి దాదాపు 600 మర బోట్లు, 1250 వరకు మోటారు బోట్లు సముద్రంలో వేట సాగిస్తుంటాయి. ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు తూర్పు తీరంలో వేట నిషేధం అమలులో ఉంటుంది. ఇక్కడ నిషేధం పూర్తయ్యాక పశ్చిమ తీరంలో మొదలవుతుంది. ఈ సమయంలో తూర్పు తీరంలో పట్టుబడిన చేపలు కొచ్చిన్, మంగుళూరు, ఉడిపి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అందువల్ల ఈ తరుణంలో చేపలకు మంచి ధర లభించడానికి దోహదపడుతుందని దానయ్య అనే బోటు యజమాని 'సాక్షి'కి చెప్పారు.



హార్బర్‌లో చేపలు

రొయ్యల లభ్యత కూడా..

మరోవైపు ప్రస్తుతం చేపలతో పాటు రొయ్యల లభ్యత కూడా బాగుంది. వారంలోపు వేట సాగిస్తున్న కొన్ని బోట్లకు టన్ను వరకు పడుతున్నాయి. వీటిలో చిన్న రొయ్యలతో పాటు బ్రౌన్, పింక్, వైట్, టైగర్ రొయ్యలు కూడా ఉంటున్నాయి. కానీ వీటి ధరలు కూడా తక్కువగా ఉండడం వల్ల గిట్టుబాటు కావడం లేదని బోటు యజమానులు చెబుతున్నారు. అయితే విదేశాల నుంచి కొనుగోళ్లు సన్నగిల్లడంతో ఎగుమతులు క్షీణించాయని, దీంతో ఆ ప్రభావం రొయ్యలపై కూడా పడుతోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా కీలకం

- పూర్తిగా ధ్రువీకరించిన తర్వాతే మార్పు చేర్పులు చేయండి
- బీఎల్‌వోలకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఓటర్ల జాబితా రూపకల్పనలో బూత్ లెవల్ అధికారులు ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా కచ్చితత్వంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్ వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు 'స్పెషల్ సమ్మరీ రివిజన్-2024'పై ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిగా ధ్రువీకరించుకున్న తర్వాతే ఓటర్ల జాబితాలో మార్పు చేర్పులు చేపట్టాలన్నారు. ప్రజలు కూడా ఎన్నికల సిబ్బందికి కచ్చితమైన ఆధార్ నంబర్/సమాచారం ఇచ్చి పారదర్శమైన ఓటరు జాబితా రూపకల్పనలో సహకరించాలని కోరారు. అక్టోబర్, నవంబర్ ఎస్ఎస్ఆర్ డ్రాఫ్ట్ రిలీజ్ చేస్తామని, వచ్చే జనవరిలో తుది ఎస్ఎస్ఆర్ ప్రకటిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులుగా సచివాలయ కార్యదర్శులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో బూత్ లెవల్ అధికారి సుమారు 1,500 మంది వరకు ఓటర్లతో జాబితా తయారు చేయాల్సి ఉంటుందన్నారు. జాబితా తయారీలో బీఎల్‌వోలు ఉద్దేశపూర్వకంగా గానీ, ఇతర ప్రలోభాలకు ఆశపడి పొరపాట్లు చేస్తే కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. విశాఖ తూర్పు, ఉత్తర, పెందుర్తి నియోజక వర్గాల్లో విధులు నిర్వహించే ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు శిక్షణకు హాజరయ్యారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి లక్ష్మా రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్ పరిధిలోని ఎయిడెడ్ స్కూళ్లలో బోధన, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సర్దుబాటు కోసం బుధవారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని సర్దుబాటు చేయగా, సెకండరీ గ్రేడ్ టీచర్లు 23 మంది, బోధనేతర సిబ్బంది 10 మంది, క్రాఫ్ట్ టీచర్ ఒకరు, డ్రాయింగ్ టీచర్ ఇద్దరికి కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని స్కూళ్లలో సర్దుబాటు చేశారు. ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్ తమ పరిధిలోని పాఠశాలలకు ప్రభుత్వ ఎయిడ్‌ను వదుకుంటున్నట్లు ఇప్పటికే సమ్మతి పత్రాన్ని అందజేసింది. ఈ నేపథ్యంలో ఇక్కడి విద్యార్థులను సమీపంలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ప్రభుత్వం ద్వారా వేతనాలు పొందుతున్న బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం 52 మందిని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లోకి తీసుకున్నారు. కాగా వీరిలో కొంతమంది ఉపాధ్యాయుల సర్వీసు పరమైన ఆరోపణలు, విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

46 మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

మధురవాడ: ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 46 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్టు ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసి.. వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మధురవాడలోని జోన్-1 పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి విశాఖలో 25, విజయనగరంలో 7, శ్రీకాకుళంలో 14 కలసి మొత్తం 46 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికారులు నిర్ధారించి కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 72 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇందులో ముగ్గురు ప్రమోషన్ వద్దన్నారు. దీంతో వారి తర్వాత స్థానంలో ఉన్న వారికి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు.

జెడ్పీ యాజమాన్య పరిధిలో..

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 22 మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంగా పదోన్నతి కల్పిస్తూ విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల హెచ్‌ఎంలను ఎంఈవోగా పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ఏర్పడిన ఖాళీల భర్తీ కోసం అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఈ నెల 4న కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు, అర్హత గల ఆసక్తి చూపిన స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్లు ఆర్జేడీ తెలిపారు. పదోన్నతి పొందిన వారిని వెంటనే ప్రస్తుత ప్రదేశాల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అలా గెలిచావా వెలగపూడి..!

- 2019లోనే దొంగ ఓట్లు నమోదు చేసిన వైనం
- జనవరి 11 నుంచి మార్చి 25లోపు 40,300 ఓట్లు నమోదు
- ఒకే ఇంటి నంబర్‌తో 300 ఓట్లు చేర్చిన వెలగపూడి అండ్ కో
- ఇప్పుడు వాటిని గుర్తించి తొలగిస్తున్న ఎన్నికల సిబ్బంది
- ఓటమి భయంతో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ
- పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేస్తున్న అధికారులు

సాక్షి, విశాఖపట్నం: మరోసారి ఓటమి భయంతో ఏం చేయాలో పాలుపోక అధికారులపై అడ్డగోలు ఫిర్యాదులు.. ఎల్లో మీడియా అండతో పచ్చి అబద్ధాల రాతలతో రోత పుట్టిస్తున్నారు తెలుగుదేశం పార్టీ నేతలు. దొంగ ఓట్లకు ఆస్కారం లేకుండా.. ఏ ఒక్కటి డూప్లికేట్ ఓటు లేకుండా ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్ చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలోనే వలస వెళ్లిపోయిన వారి ఓట్లు, మృతుల ఓట్లు, డూప్లికేట్ ఓట్లని తొలగిస్తున్నారు. అయితే దీనిపై వెలగపూడి రామకృష్ణబాబు విష ప్రచారానికి తెరతీశారు. తూర్పు నియోజకవర్గంలో 40 వేల మంది ఓట్లని తొలగించేశారంటూ పచ్చపత్రిక ఈనాడు సహకారంతో హడావిడి చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలంటూ ఎన్నికల కమిషన్ జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌ని ఆదేశించింది. తొలగించిన ఓట్ల వివరాలు.. ఎందుకు తొలగించారో సహేతుకంగా వివరిస్తూ.. ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించారు. ఓట్ల తొలగింపు సక్రమంగానే సాగిందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వంపై బురద జల్లేందుకు చేసిన ప్రయత్నం విఫలమవడంతో వెలగపూడి మరో కొత్త రాగం ఎత్తుకున్నారు. ఒకే చిరునామాతో 300 ఓట్లు నమోదు చేశారంటూ మరో ఫిర్యాదు చేశారు. దీనిపైనా విచారణ చేస్తే వెలగపూడి బాగోతం బయటపడింది.

73 రోజుల్లో 40 వేల ఓట్లు నమోదు చేసిన టీడీపీ నేతలు

వెలగపూడి ఫిర్యాదు చేస్తూ.. హడావిడి చేస్తుండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. తప్పు ఎక్కడ జరిగింది.? దీనికి ఎవరు బాధ్యులు అనేది పూర్తిగా అధ్యయనం చేశారు. ఇవన్నీ కూడా 2019 ఎన్నికల ముందు గంపగుత్తగా వెలగపూడి బ్యాచ్ నమోదు చేసిన ఓట్లుగా తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల ముందు 2019 జనవరి 11న ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాని ప్రచురించింది. ఆ తర్వాత ఓటరు నమోదు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో 25 మార్చి 2019న తుది ఎన్నికల ఓటరు జాబితాని ప్రచురించింది. ఈ 73 రోజుల కాల వ్యవధిలో తూర్పు నియోజకవర్గంలో ఏకంగా 40,300 మంది అదనపు ఓటర్లు చేరారు.

ఆ తానులో ముక్కే ఇది..

ఇక టీడీపీ ఫిర్యాదు చేసినట్లుగా.. ఒకే ఇంటి నంబర్‌తో 300 ఓట్లు కూడా అప్పటి ఓటర్ల జాబితాలోనిదేనని స్పష్టమైంది. 2019 డ్రాఫ్టురోల్‌లో డోర్ నంబర్ 13-733తో 282, 769తో 186, 790తో 166 ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇది కూడా అప్పట్లో టీడీపీ నేతలు నమోదు చేయించిన ఓట్లేనని స్పష్టమవుతోంది. ఇలా 2019 ఎన్నికలకు ముందు నమోదు చేసిన 40,300 అనుమానాస్పద ఓట్లను ఈ మధ్య కాలంలో నిర్వహించిన వెరిఫికేషన్‌లో గుర్తించిన ఎన్నికల సిబ్బంది వడపోత ప్రక్రియ చేపట్టారు. ఇందులో 13,085 డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి ఓట్లుగా ఉన్న 1226, శాశ్వతంగా విశాఖ తూర్పు నుంచి వలస వెళ్లినట్లుగా గుర్తించిన 17,769 మంది ఓట్లు.. మొత్తం 32,080 ఓట్లను తొలగించేశారు. ఇది ఓర్వలేకపోతున్న టీడీపీ నేతలు.. 2024 ఎన్నికల్లో ఓటమి ఖాయమని భయపడి.. ఆ ఓట్లు తిరిగి చేర్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

ఎన్నికల ముందే కథంతా..

2019 ఎన్నికలు సమీపిస్తుండటంతో పూర్తి స్థాయిలో పరిశీలన చేయకుండా తుది జాబితా ముద్రణ అయ్యింది. అలా ఎన్నికల ముందు టీడీపీ బ్యాచ్ తూర్పు నియోజవర్గంలో ఏకంగా 40,300 దొంగ ఓట్లని నమోదు చేయించారు. 2019 ఎన్నికల్లో వెలగపూడికి 87,073 ఓట్లు రాగా.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అక్కరమాని విజయనిర్మలకు 60,599 ఓట్లు వచ్చాయి. అంటే 26,474 ఓట్లు తేడాతో వెలగపూడి విజయం సాధించారు. ఈ విజయం కూడా సదరు టీడీపీ నేతలు నమోదు చేసిన 40,300 ఓట్ల కారణంగానే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దొంగ ఓట్లు సృష్టించారు



2019 ఎన్నికలకు ముందే తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తన అనుచరుల ద్వారా వేల కొద్దీ దొంగ ఓట్లు సృష్టించారు. ఇప్పుడు అవి తొలగిస్తుంటే భయం పట్టుకుని, అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. ఎన్నికల అధికారులు పారదర్శకంగా జాబితాని రూపొందిస్తున్నారు. అందులో భాగంగా టీడీపీ దొంగ ఓట్లు బాగోతం బట్టబయలవుతోంది. నియోజకవర్గంలో నమోదైన దొంగ ఓట్లలో ఎక్కువగా గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో ఉన్నవారి పేర్లే ఉన్నాయి. ప్రతిసారీ దొంగ ఓట్లతోనే విజయం సాధిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. ఈ సారి ఆ పప్పులు ఉడకక పోవడంతో అబద్ధపు ఆరోపణలతో ఫిర్యాదులు చేస్తున్నారు.

– అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త

అకారణంగా ఓటు తొలగించే ప్రసక్తే లేదు



ఉద్దేశ పూర్వకంగా ఎన్నికల సిబ్బంది ఓట్లు తొలగించారని వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదు. పూర్తి పారదర్శకంగా ఓటరు నమోదు ప్రక్రియతో పాటు.. వెరిఫికేషన్ కూడా పక్కాగా నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా చిన్న తప్పు దొర్లినా బీఎల్‌వోలపై చర్యలకు ఉపక్రమిస్తున్నాం. 24, 104, 236 పోలింగ్ కేంద్రాల పరిధిలో 222 మంది తాత్కాలిక వలసదారుల ఓట్లని విధుల్లో అలసత్వం కారణంగా తొలగించారు. తుది పరిశీలనలో వీటిని గుర్తించి తిరిగి చేర్చాం. సదరు బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. గతంలో ఉన్న జాబితాలో మూడు కారణాలతో పలు దశల్లో క్షేత్ర స్థాయి పరిశీలనలు చేసిన అనంతరం తొలగించాం. ఎవరైనా ఓటు లేదని భావించినా, చిరునామా మారినా, కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకుంటున్నా ఎన్నికల అధికారులు సిద్ధంగా ఉన్నారు. అకారణంగా ఓటు తొలగించారని తెలిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు.

– డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

ఏయూలో ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్

నేడు అవగాహన ఒప్పందం

ఏయూక్యాంపస్: ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్ ఏర్పాటులో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) గురువారం అవగాహన ఒప్పందం చేసుకోనుంది. ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ సమక్షంలో ఈ ఒప్పందం జరగనుందని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తెలిపారు. రూ.60 కోట్ల వ్యయంతో ఏయూలో ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. మూడు దశల్లో నిర్మాణం పూర్తవుతుంది. తొలిదశకు అవసరమైన రూ.19.5 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయని వీసీ తెలిపారు. ఏయూ, ఆర్ఐఎన్ఎల్ సంయుక్తంగా ఎస్‌టీపీఐ ఇండస్ట్రీ 4.0పై నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను కూడా ఆర్ఐఎన్ఎల్‌లో ప్రారంభిస్తారు. దీనిని రెండేళ్ల పాటు అక్కడ నిర్వహిస్తారు. తర్వాత ఏయూలో నూతనంగా నిర్మించే ప్రాంగణానికి మార్పు చేస్తారు.

నేటి నుంచి 'పీఆర్సీ' వర్క్‌షాపు

ఏయూక్యాంపస్: ఏయూ జనాభా పరిశోధన కేంద్రం, భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో గురు, శుక్రవారాల్లో వర్క్‌షాపు జరగనుంది. 10 రాష్ట్రాలకు చెందిన హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అధికారులు, దేశవ్యాప్తంగా 18 పీఆర్సీ(జనాభా పరిశోధన కేంద్రాలు) అధికారులు సదస్సులో పాల్గొంటారని ఏయూ జనాభా పరిశోధన కేంద్రం సంచాలకుడు ఆచార్య బి.మునిస్వామి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ప్రారంభమయ్యే సదస్సును కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(స్టాటిస్టిక్స్) అంజలి రావత్ ప్రారంభిస్తారు. తొలి రోజు హెల్త్ మేనేజ్‌మెంట్‌లో వస్తున్న మార్పులు, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. రెండో రోజు డేటా అనాలసిస్-యూజింగ్ స్టాటిస్టిక్స్ అంశంపై నిపుణుల ప్రసంగాలు, ప్రత్యక్ష శిక్షణ ఉంటుంది.

తీరంలో అలజడి



మంగమారిపేట బీచ్ వద్ద ఎగసి పడుతున్న కెరటాలు

కొమ్మాది: తీరంలో బుధవారం ఉదయం నుంచి ఒక్కసారిగా అలజడి మొదలైంది. ఉధృత గాలులతో పాటు సముద్ర కెరటాలు భారీ ఎత్తున ఎగసిపడ్డాయి. తిమ్మాపురం, రుషికొండ ప్రాంతాల్లో సముద్రం కాస్త ముందుకు వచ్చింది. దీంతో రుషికొండ బీచ్‌కు సాయంత్రం వచ్చిన సందర్శకులను సముద్రంలోకి వెళ్లకుండా మెరైన్ పోలీసులు, జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేశారు.

నేడు విశాఖ సంగీత కళాకారుల సమావేశం

దాబాగార్డెన్స్: సంగీత కళాకారులతో 13 ఏళ్ల కిందట ఆవిర్భవించిన విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాసరావు తెలిపారు. గాయనీ గాయకులు, కళా సంస్థల అధినేతల సభ్యత్వ నమోదు, పాత పాలక వర్గం రద్దు, అడహాక్ కమిటీ నియామకం, ఎన్నిక తేదీ ఖరారు, సీక్రెట్ బ్యాలెట్‌పై ఎన్నికలు నిర్వహణ తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. వివరాలకు 81796 05267, 95815 95054ను సంప్రదించాలని సూచించారు.

దాడి కేసులో నిందితుడికి రూ.10 వేల జరిమానా

అక్కిరెడ్డిపాలెం: ఆస్తి, ఇంటి స్థలం విషయంలో తల్లి, తమ్ముడిపై దాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జరిమానా విధించినట్లు గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. 2017 సెప్టెంబర్ 4న గుడివాడ సంజయ్ కుమార్ మిందిలోని ఆస్తి, ఇంటి స్థలం విషయంలో వివాదం నెలకొనడంతో తన తల్లి గుడివాడ పద్మావతి, తమ్ముడు మురార్జీ కుమార్‌లపై దాడి చేసి గాయపర్చాడు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్ఐ మన్మధరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి గాజువాక 3వ ఏసీఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ ఈ.రాజేంద్రబాబు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

CENTRE OF EXCELLENCE IN MARITIME AND SHIPBUILDING (CEMS)
GANDHIGRAM, VISAKHAPATNAM-530 005

REQUEST FOR PROPOSAL - (CONSULTANCY SERVICES FOR ARCHITECTURE/STRUCTURAL DESIGN/MECHANICAL/ELECTRICAL/ PLUMBING WORKS & PMC FOR CIVIL WORKS AT CEMS)

1. The prospective bidders should have minimum 3 years relevant experience with Govt/Semi-Govt civil works projects.
2. The applications shall be received at "CEMS, Gandhigram, Visakhapatnam" on or before 5.00 pm on **30 Jul 2023**. and tenders opening at 11.00 AM on **31 Jul 2023.**
3. A Pre-bid meeting will be held on **12.07.2023** at 11.30 AM at CEMS, Gandhigram, Visakhapatnam.

Further details : visit : www.cemsindia.org
or call : 0891-2704010 / 9959460254 or email: gopi@cemsindia.org
Chief Executive Officer (CEMS), Visakhapatnam.

నాన్న ప్రోత్సాహం..ఆటపై ప్రేమ

- భారత్–ఏ జట్టుకు ఎంపికైన నితీశ్ కుమార్
- కుమారుడి కెరీర్ కోసం ఉద్యోగం మానేసిన తండ్రి
- ఏసీఏ నుంచి బీసీసీఐ అవార్డు పొందిన తొలి క్రికెటర్



నితీశ్‌కుమార్



ఎమ్మెస్కే ప్రసాద్ నుంచి అభినందనలు అందుకుంటున్న నితీశ్, చిత్రంలో రాహుల్ ద్రావిడ్ (ఫైల్)

విశాఖ స్పోర్ట్స్: ఐదేళ్ల ప్రాయంలో ప్లాస్టిక్ బ్యాట్‌తో సరదాగా బంతితో ఆడటం మొదలుపెట్టిన కె.నితీశ్‌కుమార్ రెడ్డి.. నేడు ఎమర్జింగ్ ఆసియా కప్ వన్డే టోర్నీలో ఆడేందుకు భారత్–ఏ జట్టుకు ఎంపికయ్యాడు.

చిరుప్రాయం నుంచే విశాఖ డివిజన్ క్లబ్ లీగ్స్‌లో సీనియర్ల ఆటను చూస్తూ వారి లాగే ఆడాలంటూ కలగనే వాడు నితీశ్. తండ్రి ముత్యాలరెడ్డి ఉద్యోగం సైతం విడిచిపెట్టి.. కుమారుడి క్రికెట్ కెరీర్‌కే ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించారు. కోచ్‌ల శిక్షణలో నితీశ్ అంచెలంచెలుగా జిల్లా స్థాయి నుంచి రంజీ స్థాయికి ఎదిగాడు. కుడిచేతి వాటం బ్యాటింగ్‌తో పాటు మీడియం పేస్‌తో ప్రత్యర్థులను బెంబేలెత్తించి రికార్డులను సొంతం చేసుకున్నాడు. ఆంధ్రా జట్టుకు ఆల్‌రౌండర్‌గా మారాడు.

ఏసీఏ అకాడమీ వైపు అడుగులు..

నితీశ్‌కుమార్ వీడీసీఏ శిబిరాల నుంచి అండర్–12, 14 గ్రూపుల్లో జిల్లాకు ఆడటం మొదలుపెట్టాడు. నార్త్‌జోన్‌కు ఆడే సమయంలో అప్పటి జాతీయ జట్టు సెలక్టర్ ఎం.ఎస్.కె.ప్రసాద్ నితీశ్ ప్రతిభను గుర్తించారు. ఆయన ప్రోత్సాహంతో కడపలోని ఏసీఏ అకాడమీలో శిక్షణకు అవకాశం లభించింది.

విజయ్ మర్చంట్ ట్రోఫీలో రికార్డు

ఆంధ్రా తరఫున ఆడుతున్న నితీశ్ నాగాలాండ్‌తో జరిగిన పోటీలో ఏకంగా 345 బంతుల్లోనే 441 పరుగులు సాధించడం విశేషం. విజయ్ మర్చంట్ ట్రోఫీలో ఏకంగా 26 వికెట్లు తీయడమే కాకుండా 176.41 సగటుతో 1,237 పరుగులు చేసి టోర్నీలో రికార్డును నమోదు చేశాడు. ఇదే నితీశ్‌కు 2017–18 సీజన్‌లో బీసీసీఐ అండర్–16 ఉత్తమ క్రికెటర్‌గా జగన్మోహన్ దాల్మియా అవార్డును సాధించిపెట్టింది. ఏసీఏ నుంచి బీసీసీఐ అవార్డు పొందిన తొలి క్రికెటర్ నితీశ్ కావడం.. విశాఖ క్రీడాకారులకు నూతనోత్తేజం ఇచ్చింది.

అరంగేట్రం ఇలా..

నితీశ్ రంజీ ట్రోఫీలో ఆంధ్రా తరఫున తొలిసారిగా 2020లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్ మొదలెట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రా తరఫున 2021లో ఆడాడు. అదే ఏడాది సీజన్‌లోనే సయ్యద్ ముస్తక్ ఆలీ ట్రోఫీలో పొట్టి ఫార్మాట్‌లో ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అరంగేట్రం చేశాడు. శ్రీలంకలో జూలై 13 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో ఐదు దేశాల ఏ జట్లతో పాటు నేపాల్, ఒమన్, యూఏఈ సీనియర్ జట్లు ఆడనున్నాయి.

చాలా ఆనందంగా ఉంది

అప్పుడు నా వయసు పన్నెండేళ్లు. అండర్–12లో టోర్నీలు ఆడే స్థాయికి చేరుకున్నాను. ఆ సమయంలోనే నాన్నకు విశాఖ నుంచి బదిలీ అయింది. నాన్న ఉదయపూర్ వెళ్లినా నా క్రికెట్ కెరీర్ గురించే ఆలోచించేవారు. ఈ క్రమంలో ఉద్యోగం మానేసి ఇక్కడకు వచ్చేశారు. అప్పుడు మా వాళ్లు కొందరు నాన్న ఏంటి ఇలా చేశారు అన్నారు. అయినా వారి మాటలను పట్టించుకోకుండా నన్ను ప్రోత్సహించారు. ఏసీఏ తరఫున తొలి క్రికెటర్‌గా బీసీసీఐ ఉత్తమ క్రికెటర్ అవార్డు అందుకోవడంతో నాలో ఆత్మ విశ్వాసం పెంచింది. అన్ని ఫార్మాట్లలో మేటి టోర్నీలో ఆడటంతో పాటు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున క్రీజ్‌లోకి వచ్చి బ్యాటింగ్ చేస్తున్నప్పుడు నాన్న చాలా సంతోషించారు. భారత్–ఏ తరఫున ఎమర్జింగ్ ఆసియా కప్‌కు ఎంపిక చేసిన 15 మంది జట్టులో స్థానం సాధించడం ఆనందంగా ఉంది. జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా మరింత సాధన చేస్తా..

– నితీశ్‌కుమార్ రెడ్డి, క్రికెటర్

నగరంలో నేడు

- ఉదయం 9.30 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఎంపీ జీవీఎల్ నరసింహరావుకు పౌరసన్మానం
- ఉదయం 10.30 గంటలకు ఏయూ గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో 'ఎన్టీఆర్ సింహగాయత్రం' పుస్తకావిష్కరణ
- ఉదయం 10.30 గంటలకు మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబూ బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,150
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,060
వెండి(కిలో):	రూ.75,800

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.230
స్కిన్‌లెస్	: రూ.240

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	475.00
విజయనగరం	479.00
శ్రీకాకుళం	479.00

'బీసీ గర్జన సభ'కు పక్కి దివాకర్ పేరు



బీసీ గర్జన సభ కోసం సీఎం జగన్‌కు వివరిస్తున్న కర్రి వేణుమాధవ్

ఆరిలోవ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఏయూలో జరగనున్న బీసీ గర్జన సభకు దివంగత బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ సభా వేదికగా నామకరణం చేసినట్టు సంఘం అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య, ఢిల్లీ అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎయిర్‌పోర్టులో కలిసి సభ వివరాలను తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి సభకు ప్రతినిధులను పంపించాలని కోరారు. ఇందుకు ఎంపీ మిధున్‌రెడ్డిని సంప్రదించాలని సీఎం సూచించినట్టు వేణుమాధవ్ తెలిపారు.

పురందేశ్వరి.. లేడీ విలన్

- బీఆర్ఎస్ నాయకుడు జేటీ రామారావు

దాబాగార్డెన్స్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన దగ్గుబాటి పురందేశ్వరి.. లేడీ విలన్ అని బీఆర్ఎస్ నాయకుడు జేటీ రామారావు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆనాడు సోనియాగాంధీ మెప్పు కోసం రాష్ట్ర విభజన బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపి, రాష్ట్ర ప్రజలను రోడ్డుపాలు చేసిన వారిలో పురందేశ్వరి ఒకరన్నారు. మరోసారి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడానికి ఆమె సిద్ధమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఏనాడూ సమైక్యాంధ్ర, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్, అమరావతి, పోలవరం ఉద్యమాల్లో పాల్గొన లేదని, కనీసం సంఘీభావం కూడా తెలియజేయలేదన్నారు. కేవలం ఢిల్లీ సుల్తాన్‌ల మెప్పు కోసం మాత్రమే పనిచేశారని మండిపడ్డారు. రాజకీయాల్లో లేడీ విలన్‌గా పురందేశ్వరి పేరు గాంచారని ఆరోపించారు. ఆమెకు నల్ల జెండాలు, నల్ల బెలూన్లతో స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 2009 పార్లమెంట్ ఎన్నికల్లో విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేస్తానని చెప్పి వెన్నుపోటు పొడిచారన్నారు. శ్రీశ్రీ నివాసాన్ని లైబ్రరీగా మారుస్తానని సుమారు రెండు కోట్లకు పైగా వసూలు చేసి ఇంత వరకు ఎందుకు నిర్మించలేకపోయారని ఆమెను ప్రశ్నించారు.

పరిశ్రమల్లో ప్రమాదాలపై న్యాయవిచారణ చేయాలి

బుద్ధా వెంకన్న

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ జిల్లాలో తరచూ జరుగుతున్న ఫార్మా ప్రమాదాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీలతో నెల మామూళ్ల ఒప్పందం పెట్టుకుని ప్రభుత్వంలోని పెద్దలు ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. భద్రతా ప్రమాణాలను పూర్తిగా పాటించాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని, కాని మంత్రి అమర్‌నాథ్ ఎందుకు ఆ విషయం మాట్లాడటం లేదన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు ప్రకటించాలని, ఫార్మా ప్రమాదంలో గాయపడ్డవారిని జీవితాంతం ఆదుకోవాలని అన్నారు. సీఎం జగన్ మరోసారి ఢిల్లీకి ఎందుకు వెళ్లారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

అంతా మా ఇష్టం.!

- ప్రైవేటు స్కూళ్లలో సొంత సిలబస్ బోధన
- ఆ పుస్తకాలు కొనాలనే విద్యార్థులపై ఒత్తిడి
- ఎస్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాల కొనుగోలుకు ముందుకురాని వైనం
- జిల్లాలో 778 ప్రైవేటు స్కూళ్లలో పాఠ్య పుస్తకాల కోసం 408 దరఖాస్తులు

విశాఖ విద్య: ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో సమాంతర చదువులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే బోధన సాగించాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యాలు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఎస్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు కాకుండా తమ సొంత సిలబస్‌తో ముద్రించిన పుస్తకాలతోనే బోధన సాగిస్తున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నిర్వాహకులు కూడా తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలను కొనుగోలు చేయాలని విద్యాశాఖ కమిషనర్ ముందుగానే ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సైతం ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నిర్వాహకులతో సమావేశమై ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. వెబెక్స్ ద్వారా కూడా పలుమార్లు ఆమె సమావేశాలు నిర్వహించారు. కానీ జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యాలు మాత్రం విద్యాశాఖాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నాయి.

నిర్ణీత ధరకే పుస్తకాలు

జిల్లాలో ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో జిల్లా విద్యాశాఖ ద్వారా గుర్తించిన 778 పాఠశాలలు ఉన్నాయి. చైల్డ్ ఇన్ఫోలో నమోదైన విద్యార్థుల సంఖ్య మేరకు, వారికి కావాల్సిన పుస్తకాలు కొనుగోలు కోసమని సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పుస్తకాల ధర మొత్తంలో 5 శాతంను దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలి. మిగతా మొత్తాన్ని పుస్తక ముద్రణ సంస్థలకు చెల్లించి, కావాల్సిన పుస్తకాలను పాఠశాలలకు తీసుకెళ్లి, నిర్ణీత ధర మేరకు వాటిని విద్యార్థులకు అందజేయాలి. ఏ తరగతి పుస్తకాలు ఎంత మొత్తంలో వసూలు చేయాలనేది తెలియజేస్తూ, ఉన్నతాధికారులు ముందుగానే ప్రకటించారు.

408 స్కూళ్ల మాత్రమే దరఖాస్తు

విద్యాశాఖాధికారుల వద్ద నమోదైన గణాంకాల మేరకు మంగళవారం నాటికి జిల్లాలో 408 ప్రైవేటు స్కూళ్ల మాత్రమే పాఠ్య పుస్తకాలు కొనుగోలు కోసం దరఖాస్తు చేశాయి. ఈ లెక్కన ఇంకా 370 పాఠశాలలు ముందుకు రాలేదన్న మాట. అర్బన్ మండలాల్లో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అంతా మా ఇష్టం అంటూ వ్యవహరిస్తున్నాయి. విశాఖపట్నం అర్బన్‌లో 319 స్కూళ్లకు 159 మంది, గాజువాకలో 153 మందికి 84, చినగదిలి మండలంలో 122 స్కూళ్లకు 65 స్కూళ్ల నిర్వాహకులు మాత్రమే పుస్తకాల కొనుగోలుకు ముందుకొచ్చారు.

ప్రైవేటులో పుస్తకాల దోపిడీ

జిల్లాలోని కార్పొరేట్, పలు ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు తమ సొంత సిలబస్‌తో పాఠ్య పుస్తకాలు ముద్రించి, వాటినే విద్యార్థులతో కొనుగోలు చేయిస్తున్నారు. నగరంలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో ఏడో తరగతికి రూ.11,400, నాల్గో తరగతికి రూ.8,900లు కేవలం పాఠ్య పుస్తకాల కోసమే వసూలు చేసినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. పుస్తకాల పేరుతో కార్పొరేట్ స్కూళ్లలో ఏ మేరకు దోపిడీ ఉందనేది దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. విద్యాశాఖాధికారులు దీనిపై దృష్టి సారించి, కార్పొరేట్ స్కూళ్లలో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేయాల్సిందే



జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులంతా కచ్చితంగా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కోసం దరఖాస్తు చేయాలి. వాటిని తప్పనిసరిగా కొనుగోలు చేయాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అన్ని స్కూళ్లలో ఎస్‌సీఈఆర్టీ ద్వారా ముద్రించిన పాఠ్య పుస్తకాలతోనే బోధన సాగాలి.

– గౌరీ శంకర్, డెప్యూటీ డీఈవో, విశాఖ జిల్లా

ప్రియుడిపై ప్రియురాలి ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేసిన ప్రియుడిపై అతని ప్రియురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. జగదీష్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో ఓ యువతిని మభ్యపెడుతూ.. ఆమె నుంచి నగదు వసూలు చేశాడు. పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చిన ప్రతీసారి ఏదో ఒక కారణం చెబుతూ తప్పించుకుంటున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని మంగళవారం యువతి అతన్ని నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ మేరకు జగదీష్ ఆమెను దుర్భాషలాడుతూ దాడి చేసి గాయపరిచాడు. భయాందోళనకు గురైన ఆమె దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు వివరాలు సేకరించి.. జగదీష్‌పై పలు కేసులు నమోదు చేశారు.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ ప్రారంభం



బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

అగనంపూడి: అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మరియు పరిశోధనా కేంద్రం ఆవరణలో రక్తనిధి, అణువుల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులకు రక్తమార్పిడి అవసరమని, అందుకోసం బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడి రోగులతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు అవసరమైనప్పుడు రక్తాన్ని అందివ్వడం జరుగుతుందన్నారు. దాతలు ఇక్కడ దానం చేసేందుకు వీలు కల్పించామని చెప్పారు. క్యాన్సర్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రితో ఒప్పందం చేసుకుందని, ఈ మేరకు నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ద్వారా వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతిశెట్టి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆస్పత్రిలో ఇప్పటి వరకు 4వేల 5వందల మందికి వైద్య సేవలు అందించామని చెప్పారు. కలెక్టర్ ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు.

కేజీహెచ్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

- పలు వార్డుల్లో ఇదే దుస్థితి





కేజీహెచ్‌లోని పలు వార్డుల్లో పని చేయని సీసీ కెమెరాలు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలు పని చేయడంలేదు. ఇక్కడ అనేక వార్డుల్లో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మిగిలాయి. గత కొద్ది రోజుల నుంచి ఆస్పత్రిలో 158 సీసీ కెమెరాల్లో 24 కెమెరాలు మాత్రమే పని చేస్తున్నాయి. ఇటీవల ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పని చేయని విషయం బయట పడింది. కేజీహెచ్‌లో 2018లో సీసీ కెమెరాల వ్యవస్థ మొదలైంది. మొత్తం 26 వార్డులతో పాటు ప్రధానమైన క్యాజువాలిటీ, మార్చురీ, గైనిక్ విభాగాల్లో 108 సీసీ కెమెరాలు అమర్చారు. ఆ తర్వాత వినియోగంలోకి వచ్చిన సీఎస్ఆర్ బ్లాక్‌లో అదనంగా 50 సీసీ కెమెరాలు వినియోగంలోకి వచ్చాయి. కేజీహెచ్‌లో మొత్తం 158 సీసీ కెమెరాలతో నిఘా కొనసాగుతోంది. అయితే వీటిని సరైన విధంగా నిర్వహించపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. ఇటీవల అచ్యుతాపురం ఫార్మ కంపెనీలో అగ్ని ప్రమాదానికి గురైన ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు పని చేయని వైనంపై పలు పార్టీల నాయకులు ఆందోళన చేశారు. ఆ దృశ్యాలు కావాలని కేజీహెచ్‌లో వైద్యాధికారులను అడిగారు. అప్పుడు సీసీ కెమెరాలు పని చేయడం లేదని అధికార యంత్రాంగానికి తెలిసింది. తక్షణం సీసీ కెమెరాలు వినియోగంలోకి తేవాలని పోలీసులు కేజీహెచ్ అధికారులను కోరారు. పార్కింగ్ ఏరియా, భావనగర్, రాజేంద్రప్రసాద్ వార్డు, మార్చురీ ప్రాంతం, ఆర్థోపెడిక్, కార్డియాలజీ విభాగాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పని చేస్తున్న వార్డుల్లోని కెమెరాల్లో స్పష్టత లేదని తెలుస్తోంది. మూడు సంవత్సరాలు దాటిన కెమెరాల పనితీరు అంతంతమాత్రంగానే ఉంటుంది. కాని ఇక్కడ అయిదు సంవత్సరాలు దాటిన కెమెరాలు ఉన్నాయి.

పనిచేయకపోవడం వాస్తవమే



కేజీహెచ్‌లో సీసీ కెమెరాలు పని చేయకపోవడం వాస్తవమే. ఈ విషయం ఇటీవల తెలిసింది. తక్షణం కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించాం. వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నాం.

డాక్టర్ శివానంద్,
కేజీహెచ్ సూపరింటెండెంట్.

'16 రోజుల్లో సినిమా చిత్రీకరణ పూర్తి చేస్తాం'



మాట్లాడుతున్న నిర్మాత బ్రహ్మాజీ

దాబాగార్డెన్స్: జెస్విన్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించబోయే రెండో చిత్రాన్ని నిర్మాత ప్రకటించారు. దాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కొత్త చిత్రం వివరాలను వెల్లడించారు. ముందుగా నిర్మాత బెన్నబత్తుల బ్రహ్మాజీ మాట్లాడుతూ జెస్విన్ సినిమాస్ పతాకంపై గతంలో తస్మాత్ జాగ్రత్త సినిమా తీశానని గుర్తు చేశారు. రెండో సినిమా కేవలం 16 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసి.. ఈ ఏడాది డిసెంబర్‌లో సినిమా విడుదల చేస్తామని వెల్లడించారు. దర్శకుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ, అరకు తదితర లొకేషన్లలో సినిమా చిత్రీకరణ పూర్తి చేస్తామన్నారు. హీరో రతన్‌కాంత్ మాట్లాడుతూ తస్మాత్ జాగ్రత్త సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యాయని, రెండో సినిమాలో కూడా మంచి పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమాలో తనది మంచి పాత్ర అని హీరోయిన్ సుష్మా జెస్విన్ తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్లు దుర్గాప్రసాద్, నాగమణి, కెమెరామన్ సంతోష్, నటులు త్రినాథ్, నీహారిక, పాటల రచయిత తుమ్మల శివాజీ, ఈవెంట్స్ అధినేత దామోదర్ పాల్గొన్నారు.

ఔషధ గుణాల లింగ్జీ పుట్టగొడుగు



అరుదైన, విలువైన ఔషధ విలువలు కలిగిన లింగ్జీ పుట్టగొడుగు పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో కనువిందు చేసింది. చైనా, జపాన్‌తో పాటు పలు ఆసియా దేశాలలో దీర్ఘాయువును ఇచ్చే ఔషధ విలువలు కలిగినదిగా దీనిని భావిస్తారు. దీని శాస్త్రీయ నామం గానోడెమ్మా లూసిడమ్. లాటిన్ పదం లూసిడస్ అంటే మెరిసే, తెలివైన అనే అర్థం వస్తుంది. చైనా భాషలో లింగ్జీ అనే పేరు ఆధ్యాత్మిక శక్తిని, అమరత్వం సారాంశాల కలయికను సూచిస్తుంది. చెక్క ఆకృతిలో విభిన్న రంగులలో ఇది కనిపిస్తుంది. ఈ పుట్టగొడుగు ఉపరితలం వార్నిష్ రూపంలో ఉంటుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడం, రోగ నిరోధక వ్యవస్థను స్థిరీకరించడం వంటివి ప్రయోజనాలు కలిగి ఉందని పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు.

– ఏయూ క్యాంపస్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ ఇంటర్ ఫెయిలా! చింతించవద్దు. Join A.P. Govt, Recognised Board for Intermediate. Exams October - 2023. (C) : 95813 84578, 90636 15623 [V- 1990]

CERTIFICATE LOST

KAPARAPU ANNAPURNA S/o Kaparapu Vinodh Kumar (Late), Gopalapatnam, Visakhapatnam - 530027. I lost my Son, Certificiate Bearing while I am travelling by From Kancharapalem To Pendurthi. On 27-06-2023. If anybody found please Contact by me. 95500 11127

SEPTIC TANK CLEAN

■ శ్యామ్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ హైటెక్ మిషన్‌తో అతి తక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా 10 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్: 90149 03518, 98488 06516 [V-1974]

Real Estate

FLATS FOR SALE
2 BHK, 1050 sft. 38 LAKHS
3 BHK, 1610 sft. 58 LAKHS
Few Flats available
DVR CLASSIC
Madhurawada, Near Ayodhya Nagar
9989066678

Wanted

■ ✦ Sr.Marketing Executives. ✦ Office Admin. ✦ Store Incharge For Medical Device Dealers. Sadana Inc, Nowroji Road, Maharanipeta, Vizag. Ph : 98495 11544, 95533 55821 [V- 6567]

■ RBL CREDIT CARDS AGENCY నందు గాజువాక, అనకాపల్లిలో పనిచేయుటకు Re-covery Executives కావలెను. జీతం + అలవెన్స్ 16వేలు. సెల్: 79816 57599, 89856 96117. [N-1189735]

స్థలం అమ్మకం

■ 20 సెంట్లు, 13 సెంట్లు 40 అడుగుల రోడ్డు అనుకొని వుడా లే అవుట్ స్థలములు కలవు. కోరాడ గ్రామం, పద్మనాభం మండలం హైవేకి 4 కి.మీ. దూరంలో ఉన్నవి. ఫోన్: 62811 62787 [V- 776858]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడివార్డెన్స్, ఆయాలు, భార్యభర్తలు, డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-11279]

REAL ESTATE / WANTED

■ ప్రముఖ విద్యాసంస్థకు ఆనందపురం నుండి తగరపువలస ఏరియాలో 3 ఎకరాల స్థలంలో లక్ష చదరపు అడుగుల బిల్డింగ్ కట్టి ఇచ్చుటకు ఆసక్తి గలవారు : 94924 32299 [V- 6564]

■ Wanted Male Marketing Executives Male Class Incharges, Male Cashiers. Qualification: Any Degree, Salary: 13000 to 21000/-. Experienced Persons Preferrable. Age: 25 to 45. Job Location: Vizag & Gajuwaka. Master Minds College. Contact: 92487 33302, 80085 56073 [G-4425]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10745]

OLD AGE HOME

■ విశాఖ లైఫ్ కేర్ సీతమ్మధార డాక్టర్స్ కోలనీలో వృద్ధులకు, మంచాన వున్నవారికి ఆధునిక వసతులతో పాటు భోజన, డాక్టర్స్, నర్స్, ఆయా సదుపాయం. మీ ఇంటి వద్దకే మా సేవలు. ఫోన్: 98482 99968, 93307 96693 [V-11636]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించినపిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం